# అన్నదాతలకు అండగా ప్రభుత్వం

- ఏఎంసీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్
- శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం


రిబ్బన్ కత్తిరించి శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్

**చిలకలూరిపేట:** అన్నదాతలు అహర్నిశలు శ్రమించి సాగుచేసిన పంటలను అమ్ముకొనే క్రమంలో దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ చెప్పారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో మార్క్‌ఫెడ్ ద్వారా జీడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు కూడా రైతుల కోసం ఇంతగా శ్రద్ధ చూపిన దాఖలాలు లేవని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు రైతు భరోసా కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. రబీ సీజన్ పండించిన పప్పు ధాన్యాల కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభిస్తున్న శనగల కొనుగోలు కేంద్రంలో క్వింటా శనగలకు రూ. 5,335 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రైతులు పండించిన మిగితా పప్పు ధాన్యాలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లను చేస్తున్నదని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని శనగ రైతులు ఎవరైనా శనగల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ దేవినేని శంకరరావు, సొసైటీల అధ్యక్షులు తోట బ్రహ్మస్వాములు, సింగారెడ్డి కోటిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం.వీరారెడ్డి, డైరెక్టర్లు షేక్ అబ్దుల్‌గని, బండారు దాసు, దేవరకొండ నాగేశ్వరరావు, సింగరేసు పోలయ్య, ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి యు.యోగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు


పచ్చపెసర పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

**రొంపిచర్ల:** మండలంలోని మాచవరం, నల్లగార్లపాడు గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పంటలను బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. మినుము, పచ్చపెసర, వరి పొలాలను మాచవరం గ్రామ పరిధిలో పరిశీలించగా, నల్లగార్లపాడు గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. పైరుపై ఆశించిన పురుగు, తెగుళ్లను పరిశీలించి రైతులకు సూచనలు అందజేశారు. పరిశీలనకు ముందుగా మాచవరం గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి సాగులో ఉన్న, గత సీజన్‌లో సాగుచేసిన పంటలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీడీఏ శివకుమారి, ఏడీఏ పి. మస్తానమ్మ, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, వీఏఏ విజయలక్ష్మీ, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### కంభంపాడులో మిరప క్షేత్ర ప్రదర్శన

**వినుకొండ(నూజెండ్ల) :** మండలంలోని కంభంపాడు గ్రామంలో రైతు వట్టికొండ శ్రీనివాసరావు పొలంలో మిరప క్షేత్ర ప్రదర్శన బుధవారం జరిగింది. ప్రజ్వల్ సీడ్స్ కంపెనీ హైబ్రీడ్ మిరప, పీఎస్, తేజ-8888 రకాల ద్వారా రైతులకు అధిక దిగుబడి వస్తుందని చుట్టు పక్కల గ్రామాల నుంచి వెయ్యి మంది రైతులు క్షేత్రస్థాయిలో పాల్గొని పంట దిగుబడిని పరిశీలించారు. ప్రతికూల వాతావరణంలో సుమారు 40 క్వింటాల దిగుబడి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఎస్. శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మీ సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ ప్రతినిధి మహానందీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

**నరసరావుపేట టౌన్:** జూద శిబిరంపై దాడులు నిర్వహించి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,600 స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్ర బాబు బుధవారం తెలిపారు. యలమంద తురకపాలెం గ్రామంలోని పాడుబడ్డ పంచాయతీ కార్యాలయంలో జూదం ఆడుతున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### వృద్ధులకు అన్నదానం



**సత్తెనపల్లి:** పట్టణంలోని ఆదరణ వృద్ధుల ఆశ్రమంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ముప్పాళ్ల మండలం ఇరుకుపాలేనికి చెందిన చిన్నారి వర్షిత్ పుట్టిన రోజు సందర్భంగా తల్లిదండ్రులు బాలకృష్ణ, రమ్య అన్నదానం చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు మల్లేశ్వరి, కె.సురేష్, నాని, సోమశేఖర్, నిర్వాహకులు రిషిత పాల్గొన్నారు.

### డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించండి

**సత్తెనపల్లి:** చిన్న మొత్తాల పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించాలని నర్సరావుపేట పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి తెలిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల ప్రధాన తపాలా కార్యాలయంలో ఏజెంట్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పోస్టాఫీసు పొదుపు పథకాల్లో పెట్టుబడి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. పోస్టాఫీసు పొదుపు పథకాలైన రికరింగ్ డిపాజిట్, నేషనల్ సేవింగ్స్, తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా బీమాలో పెట్టుబడి పెడితే సొమ్ముకు భద్రత ఉంటుందని చెప్పారు. సమావేశంలో పోస్టు మాస్టర్ జె. రామకృష్ణ కుమార్ పాల్గొన్నారు.

### 'స్వచ్ఛ సత్తెనపల్లి'కి సహకరించాలి

**సత్తెనపల్లి:** స్వచ్ఛ సత్తెనపల్లికి ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణాన్ని ఓడీఎఫ్ ప్లస్‌గా, గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. పురపాలక సంఘ పరిధిలో బహిరంగ మూత్ర విసర్జన చేసిన వారికి రూ. 50, బహిరంగ మలవిసర్జన చేసిన వారికి రూ.200, చెత్తను వీధులు, మురుగు కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో పారవేసిన వారికి రూ.50 జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

## సోషల్ ఆడిట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఏవో సీహెచ్ సరిత
- లింగారావుపాలెం గ్రామసభలో ఈ క్రాప్ సోషల్ ఆడిట్‌పై అవగాహన
- శనగ విక్రయాలకు రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్టర్ చేసుకోండి


ఆర్‌బీకేలో ఈ క్రాప్ జాబితాలను వెల్లడించిన అధికారులు

**యడ్లపాడు:** రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను మండలంలోని రైతుభరోసా కేంద్రాలో ప్రదర్శనకు పెట్టినట్లు మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత చెప్పారు. మండలంలోని లింగారావుపాలెం ఆర్‌బీకేలో బుధవారం వ్యవసాయ అధికారులు గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 2022-23 రబీ సంబంధించిన పంటలను ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు. సీజన్‌లో 698 మంది రైతులు మొత్తం 2,778 ఎకరాలలో వివిధ రకాల పంటల్ని మండల రైతులు సాగు చేసినట్లు గుర్తించామన్నారు. ఆయా జాబితాలను సోషల్ ఆడిట్ నిమిత్తం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల నోటీసు బోర్డుల్లో ఉంచినట్లు తెలిపారు.

ఈనెల 13వ తేదీ నుంచి ఏర్పాటు చేసిన ఆయా జాబితాల్లో రైతులు, తమ పంటకు సంబంధించిన అన్ని వివరాలకు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే వాటిలో అభ్యంతరాలు ఉంటే ఈనెల 16వ తేదీ నాటికి సమీప ఆర్‌బీకేలలో రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. వాటిని అర్జీలను గ్రీవెన్స్ ద్వారా అనుమతి తీసుకుని సరిచేసుకునే వీలుంటుందని వెల్లడించారు. రబీ సీజన్‌లో అన్ని గ్రామాల్లోనూ పంటలు ఉండవు కాబట్టి పంటలు వేసిన గ్రామాల్లోని ఆర్‌బీకేలలో గ్రామసభను ఏర్పాటు చేసి రైతులకు వీటిపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

**ఆర్‌బీకేల ద్వారా శనగ కొనుగోలు ప్రభుత్వం సిద్ధం**

రబీ సీజన్‌లో మండలంలో శనగ సాగు చేసిన రైతుల నుంచి నేరుగా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఏవో సరిత తెలిపారు. మండలం పరిధిలో రబీ సీజన్‌లో అత్యధికంగా శనగ పంటను 2359 ఎకరాలల్లో సాగైనట్లు చెప్పారు. అలాగే 305 జొన్న వివిధ గ్రామాల్లో శనగ సాగు చేసిన రైతులు సత్వరమే తమ వివరాలతో పాటు ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్లను ఆర్‌బీకేలో ఇచ్చి రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. కొనుగోలు సమయాలు ఎప్పుడు, ఏమిటీ అన్న పూర్తి వివరాలు రిజిస్టర్ చేసుకున్న రైతు ఫోన్‌కు పూర్తి సమాచారం వస్తుందన్నారు. శనగ రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకునే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు మీ గ్రామంలోని ఆర్‌బీకేలను సంప్రదించాలని చెప్పారు.

## నేటి నుంచి తిరుమలలో జాతీయస్థాయి సమ్మేళనం


ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

**నరసరావుపేట రూరల్:** సాంకేతిక రంగ విద్యార్థులను ప్రోత్సహించేందుకు తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో రెండురోజుల పాటు జాతీయస్థాయి సాంకేతిక, సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. నారాయణ తెలిపారు. సమ్మేళనం ప్రచారం కార్యక్రమంలో భాగంగా గురువారం కళాశాల ఆవరణలో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొని డాన్స్‌లు చేశారు. అలాగే విద్యార్థినులకు రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ మాట్లాడుతూ టీఈసీ ప్రయాగ పేరుతో ఈనెల 16,17 తేదీలలో జాతీయస్థాయి సాంకేతిక, సాంస్కృతిక సమ్మేళనంను కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సాంకేతిక విభాగంలో పత్రసమర్పణ, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, కోడ్ హంట్ అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. సాంస్కృతిక విభాగంలో చిత్రలేఖనం, క్లేమౌల్డింగ్, నృత్యం, వాద్యసంగీతం, సాంప్రదాయ వస్త్రధారణ అంశాల్లో పోటీలో నిర్వహిస్తామని వివరించారు. క్రీడల్లో పురుషులకు కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, పరుగు, మహిళలకు ఖోఖో, త్రోబాల్, క్యారమ్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు.

## 22న అడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల

ఆలయానికి 200 సంవత్సరాలు చరిత్ర


అడవిపేరంటాలమ్మ అమ్మవారి దేవాలయం (ఇన్‌సెట్‌లో) అమ్మవారి మూలవిరాట్

**శావల్యాపురం:** ఉగాది పర్వదినం పురస్కరించుకుని మండలంలోని శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల వేడుకలు ఈనెల 22న తేదీన జరగనుంది. కొన్ని సంవత్సరాల క్రితం పేరయ్య, పేరమ్మ దంపతులు ఆవులు మేత కోసం అడవికి వెళ్లగా అడవిలో మేపుతుండగా హఠాత్తుగా పులి పేరయ్యపై దాడి చేసి చంపేసింది. భర్త మరణాన్ని తట్టుకోలేని భార్య చితిమంటల్లో దూకి సతీసహగమనం చేసింది. తదిపరి ఇరువురు దంపతులు అడవిలో శిలరూపాల్లో వెలిశారు.శిలల రూపాల్లో వెలిసిన పేరయ్య, పేరమ్మలను అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారిగా నామకరణం చేసి నాప రాళ్లతో దేవాలయంగా ఏర్పాటు చేసి 200 వందల సంవత్సరాలు నుంచి పూజలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. కొన్ని సంవత్సరాలు అనంతరం బొందిలిపాలెం గ్రామానికి చెందిన పాపసాని పేంటయ్య మరొకరు అమ్మవారి దేవాలయం అభివృద్ధికి 5 ఎకరాలు పొలాన్ని విరాళంగా ఇచ్చారు. అప్పటి నుంచి ఉగాది పర్వదినం ప్రతి ఏటా తిరునాళ్ల వేడుకలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రానురాను అమ్మవారి విశిష్టత నలుమూలలకు వ్యాపించడంతో ఎండోమెంటు పరిధిలో చేరింది. ప్రతిఏటా తిరునాళ్ల వేడుకలు ఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు, దేవదాయ అధికారులు, అన్నీ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా జరుపుతున్నారు. ఇరు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు.

## మొదటిరోజు 13 మంది గైర్హాజరు


ఏఎంజీ వద్ద పరీక్షలు రాయటానికి వెళుతున్న విద్యార్థులు

**నాదెండ్ల:** గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 1417 మంది విద్యార్థులకు గాను 13 మంది గైర్హాజరయ్యారు. ఒక్క నిమిషం నిబంధన పాటించారు. ఉదయం 8.30 గంటలకు పరీక్ష హాలులోకి అనుమతించగా, 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష జరిగింది. చీఫ్ సూపరింటెండెంట్‌గా కె.ఎం.రత్నకుమార్, డిపార్ట్‌మెంట్ అధికారిగా వై.రమేష్ వ్యవహరించారు. సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ చైతన్య పర్యవేక్షించారు. నాదెండ్ల ఎస్సై ఎ.భాస్కర్ బందోబస్తు నిర్వహించారు.

**తొలిరోజు 96.91 శాతం విద్యార్థుల హాజరు**

**చిలకలూరిపేటటౌన్:** ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభయమ్యాయి. నియోజకవర్గ పరిధిలో ఐదు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ 1590 విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 1541 మంది హాజరయ్యారు. మొత్తం 96.91 శాతం విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. అర్బన్ సీఐ జి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఫ్యామిలీ వైద్యాధికారికి విశేష స్పందన


గుర్రంవారిపాలెంలో పాల్గొన్న వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం

**శావల్యాపురం:** ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం అన్నారు. బుధవారం మండలంలోని కొత్తలూరు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన గుర్రంవారిపాలెంలో ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి రోగుల ఇళ్లకు నేరుగా వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం సందర్శించి వారికి అందుతున్న వైద్య చికిత్సలు పరిశీలించి తగు సూచనలు చేశారు. అంగన్‌వాడీ సెంటరును సందర్శించి గర్భిణులు, బాలింతలు చిన్నారులు రక్తహీనత నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆరోగ్య సూత్రాలు వివరించారు. 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందు బిళ్లలు ఇంజెక్షన్లు చేశారు. ఆయనతో పాటు ఆరోగ్య కార్యకర్త కోమలి, ఎంఎల్‌హెచ్‌వో సంకీర్తన, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## లేగదూడల అందాల పోటీలు


బహుమతులు అందజేస్తున్న డాక్టర్ సి.హెచ్.నరసింహులు

**రొంపిచర్ల:** మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేగదూడల అందాల పోటీలను బుధవారం ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్.నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్యంగా, అందంగా ఉన్న లేగదూడలను ఎంపిక చేసి యజమానులకు బహుమతులు అందజేశారు. లేగదూడలకు నట్టల నివారణ మందులు, పోషకాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. లేగదూడల పెంపకం, ఆరోగ్య విషయాలపై రైతులకు వివరించారు. లేగదూడలకు చిన్న వయస్సులోనే అవసరమైన పోషకాలు ఉన్న ఆహారాన్ని అందిస్తే సరైన తరుణంలో ఎదకు వస్తాయన్నారు. ఆరోగ్యంగా పశువు ఎదుగుదల ఉన్నప్పుడే రైతుకు కూడా లాభం చేకూరుతుందన్నారు. పశు పోషణకు, పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చి రాయితీలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇండ్ల శ్రీనివాసరెడ్డి, రాజనాల పోలిరెడ్డి, నాగిరెడ్డి, ఏపీఎల్‌డీఏ డాక్టర్ ధనుంజయ రెడ్డి, కర్లకుంట డాక్టర్ సాయిమహేశ్వర రెడ్డి, గోపాలమిత్రలు దొండేటి కృష్ణారెడ్డి, కర్లకుంట వీడీ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారం అభినందనీయం


క్రీడాదుస్తులను అందజేస్తున్న దాత తమ్మిశెట్టి శ్రీనివాసరావు

**శావల్యాపురం:** ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాకారుల అభ్యున్నతికి దాతలు సహకారం అభినందనీయమని బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీనియర్ ఆంగ్ల బోధకులు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే గుంటూరు జిల్లా జూనియర్ (అండర్-19) బాలికల బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు రూ.12 వేలు ఆర్థిక సహాయం దాతలు అందించారు. ఈ సందర్భంగా శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య క్రీడాకారులు భోజన నిమిత్తం రూ.6 వేలు, పాఠశాల పూర్వ విద్యార్థి తమ్మిశెట్టి శ్రీనివాసరావు క్రీడా దుస్తులు నిమిత్తం రూ.6 వేలు వితరణ చేయటం పలువురికు ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈబాలికల జట్టు ఈనెల 17 నుంచి 20 వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

## గుణాత్మక విద్యను అందించాలి

ఆర్‌జేడీ సుబ్బారావు


మాట్లాడుతున్న ఆర్‌జేడీ సుబ్బారావు

**నరసరావుపేట రూరల్:** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆర్‌జేడీ సుబ్బారావు తెలిపారు. లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో రెండు రోజులు పాటు పునాదిభాష, గణితంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆర్‌జేడీ సుబ్బారావు సందర్శించి మాట్లాడారు. విద్యార్థుల్లో ప్రమాణాలు పెంచేందుకు నూతన విద్యావిధానంలో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భాష, గణితంపై పునాది అభ్యసనం పెంచేందుకు శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని తెలిపారు. మూడవ తరగతిలోనే విద్యార్థులు భాష, గణితాలను చదవడం, వ్రాయటం చేసే విధంగా నూతన విద్యావిధానంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.కె.సుభాని మాట్లాడుతూ ఇంటరాక్టివ్ విధానంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎంఈవో జ్యోతికిరణ్, డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు యోగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్, రీసోర్స్‌పర్సన్స్ ఎం.శారద, రామకోటయ్య పాల్గొన్నారు.

## కొంకెరు వాగు మార్గంలో నూతన వంతెన

ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు సహకారంతో సమస్య పరిష్కారం


ఇర్లపాడు నుంచి గుండేపల్లి మార్గంలో ఏర్పాటు చేసిన వంతెన

**శావల్యాపురం:** మండలంలోని ఇర్లపాడు నుంచి గుండేపల్లి పొలాలకు వెళ్లటానికి కొంకెరు వాగుపై నూతన వంతెన (బ్రిడ్జి) పనులు పూర్తి అయినట్లు మండల పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో ఎంపీ నిధులు రూ.23 లక్షల వ్యయంతో 35 మీటర్ల పొడవు కల్గిన వంతెన నిర్మాణ పనులు అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా చేసినట్లు చెప్పారు. ప్రకాశం జిల్లా వెల్లంపల్లి నుంచి 22 సిమెంటు పైపులను ఏర్పాటు చేసి తదుపరి కంకర డస్ట్ పోసి కాంక్రీట్ పోసి వంతెన నిర్మాణ పనులు చేశామన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి ఇరు గ్రామాలకు ప్రజలు రాకపోకలకు పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే చొరవ చూపటంతో 300 ఎకరాలు రైతులు ఇరుగ్రామాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణంతో గుండేపల్లి గ్రామం వెళ్లటానికి దూరం తగ్గింది.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలు చేయాలి


కండ్రిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీపీ బత్తి రాములు

**బొల్లాపల్లి :** జగనన్న గోరుముద్ద పథకంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంపీపీ బత్తి రాములు అన్నారు. మండలంలోని కండ్రిక ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీపీ సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం తనిఖీ చేసి పాఠశాలలో తరగతుల నిర్వహణను, విద్యార్థులకు అందించే బోధన తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, నాణ్యత కలిగి ఉండాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో గుట్లపల్లి విద్యాసంక్షేమ సహాయకులు టి.అనిల్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పౌడా కార్యాలయ పనుల పరిశీలన


పౌడా సంస్థ చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానిస్తున్న కమలాకరరెడ్డి


**నరసరావుపేట:** పల్నాడు జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన పల్నాడు జిల్లా పట్టణాభివృద్ధి ప్రణాళిక (పౌడా) సంస్థ కార్యాలయ ప్రారంభోత్సవానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా అరండల్‌పేటలోని ఓ ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకొని కార్యాలయంగా మార్పే ప్రక్రియను చేపట్టారు. బుధవారం పనులు చూసేందుకు చైర్మన్ మిట్టపల్లి రమేష్, వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ గురువారెడి, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ డీవీ రఘురామ్ వచ్చారు. వారి సమక్షంలో నూతన ప్లానింగ్ ఆఫీసర్‌గా గురువారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిని ఏపీ లైసెన్సుడ్ ఇంజినీర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొమ్మసాని కమలాకరరెడ్డి కలిసి అభినందనలు తెలిపి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఆఫీస్ కార్యకలాపాలు, సంస్థ విధివిధానాల గురించి, ప్రజలకు ప్లానుల అనుమతుల మంజూరు విషయాల గురించి వారు చర్చించారు.

## 22న రెడ్డిపేరంటాలమ్మ ఆలయ వార్షికోత్సవం


రెడ్డిపేరంటాలమ్మ ఆలయం (ఫైల్)

**నాదెండ్ల:** కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 22న ఉగాది రోజున జరగనున్నాయి. ఐదు విద్యుత్ ప్రభలు ఏర్పాటు కానున్నాయి. గుంటూరు-కర్నూలు రాష్ట్రీయ రహదారిపై సాతులూరు గ్రామంలో కొన్ని దశాబ్దాల క్రితం గ్రామానికి చెందిన రెడ్డియ్య, పేరంటాలమ్మ దంపతులు గ్రామంలో ఆధ్యాత్మికతతో నివశించేశారు. ప్రస్తుతం దేవాలయం ఉన్న చోట దంపతులు ఇరువురూ శిలలుగా మారడంతో గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది గ్రామస్తులు ఉగాది రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇదేకాక ప్రతి గురు, ఆదివారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ స్థానికులే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా వచ్చి మొక్కుబడులు తీర్చుకుంటారు. ఆలయం సమీపంలో జువ్విచెట్టు ఉండటంతో దేవాలయానికి వచ్చే భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఈ చెట్టు కిందనే రైతులు పండించిన పంటలు ఇంటికి రాగానే రెడ్డిపేరంటాలమ్మ తల్లికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పిస్తుంటారు. కొందరైతే వేలాది రూపాయలు ఖర్చు చేసి కుంకుమ బండ్లు కట్టి ఆలయానికి తరలించి పూజలు జరుపుతారు. కొత్తవాహనం కొనుగోలు చేసినా, ఏ శుభకార్యం జరిగినా ఆలయం వద్ద పూజలు చేయటం ఆనవాయితీగా వస్తుంది.

## సీనియర్ జర్నలిస్ట్ మూర్తి మృతికి సంతాపం


మాదిరాజు రామమూర్తి (ఫైల్)

**రొంపిచర్ల:** మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మాదిరాజు రామమూర్తి(62) బుధవారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రామమూర్తి ఈనాడు, ఆంధ్రభూమి దినపత్రికల్లో సుదీర్ఘకాలం విలేకరిగా పనిచేశారు. ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా ఉన్నారు. ఆయన పార్థివదేహాన్ని పలువురు ప్రజా సంఘాల నాయకులు, అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.. నివాళి అర్పించిన వారిలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ బహుజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, టీడీపీ నాయకులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీబీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోదా రమేష్ కుమార్ తదితరులు ఉన్నారు.